క్లుప్తంగా

పాండురంగస్వామికి పొంగళ్లు



బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని పార్లపల్లెలో శ్రీపాండురంగ స్వామి ఆలయం అవరణలో బుధవారం గ్రామస్తులు పొంగళ్లను పెట్టి స్వామివారికి నివేదించారు. శ్రీ పాండురంగ స్వామికి చిత్రపటాలను పూలతో అలంకరించారు. ఉత్సవ విగ్రహానికి అభిషేకాలు చేసి, పూలతో అలంకరించి పూజలు చేశారు. అనంతరం పొంగళ్లు పెట్టి మొక్కులు తీర్చుకున్నారు. తీర్థ ప్రసాదాలను పంపిణీ చేశారు.

రైతులకు అందుబాటులో ఎరువులు



ఎరువులను తీసుకెళుతున్న రైతులు

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని రైతు భరోసా కేంద్రాల ద్వారా పంపిణీ చేస్తున్న ఎరువులను రైతులు సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి భారతి తెలిపారు. బుధవారం స్థానిక రైతు భరోసా కేంద్రంలో రైతులకు యూరియా, డీఏపీ, ఎరువులను పంపిణీ చేశారు. ఆమె మాట్లాడుతూ భరోసా కేంద్రాల ద్వారా రైతులకు 21 రకాల సేవలు అందుతున్నాయని, ఈ సేవలను రైతులు సద్వినియోగం చేసుకుని, వ్యవసాయంలో లాభాలను సాధించాలని తెలిపారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారి దివాకర్

బుచ్చినాయుడుకండ్రిగ: సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వైద్యాధికారి దివాకర్ తెలిపారు. ఆయన బుధవారం బుచ్చినాయుడుకండ్రిగ పంచాయతీ పరిధిలోని లక్ష్మీపురం ఎస్టీ కాలనీలో వర్షాకాలంలో వచ్చే వ్యాధులపై గిరిజనులకు అవగాహన కల్పించారు. కలుషితమైన నీరు, ఆహార పదార్థాలను తీసుకోవడం ద్వారా టైఫాయిడ్, అతిసారం వస్తాయని, దోమల కారణంగా మలేరియా, వైరల్ ఫీవర్, డెంగీ, చికున్ గున్యా వంటి వ్యాధులు వస్తాయన్నారు. ప్రతి ఒక్కరూ పరిసరాల పరిశుభ్రతతో పాటు వ్యక్తిగత పరిశుభ్రత పాటిస్తే వ్యాధులను అరికట్టవచ్చని తెలిపారు. సీహెచ్ఓ వెంకటేశ్వర్, గ్రామ కార్యదర్శి ఇందిరమ్మ, ఉపసర్పంచ్ మునిరాజా, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

విద్యా సామగ్రి పంపిణీ



విద్యాసామగ్రి అందజేస్తున్న కోటేశ్వరబాబు

శ్రీకాళహస్తి: చదువుతోనే ఉన్నత శిఖరాలకు చేరుకోవడం సాధ్యమని సంఘసేవకుడు కోటేశ్వరబాబు అన్నారు. పట్టణంలోని వైష్ణవకోనేరు సమీపంలోని ఈశ్వరయ్యకాలనీలో 1–5వ తరగతి చదివే 30మంది పిల్లలకు విద్యాసామగ్రిని పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ చిన్నతనం నుంచే సేవాభావం అలవరచుకోవాలన్నారు. గిరిజన విద్యార్థులు బాగా చదివి తల్లిదండ్రులకు, తమకు చదువు నేర్పిన పాఠశాలకు మంచిపేరు తీసుకురావాలన్నారు. శ్రీకాళహస్తి మండల పరిధిలోని గిరిజన, దళిత విద్యార్థులకు తన వంతు సాయం చేస్తామన్నారు.

పీహెచ్‌సీ మాజీ అటెండర్ మృతి

వరదయ్యపాళెం: మండలంలోని చిన్న పాందూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఒప్పంద పద్ధతిలో బాధ్యతలు నిర్వర్తించిన మాజీ అటెండర్ నాగరత్నమ్మ (80) గురువారం తెల్లవారు జామున మృతి చెందారు. ఆమె 50 ఏళ్లకు పైగా అటెండర్‌గా ఆస్పత్రిలో సేవలందించారు. ఆమెకు రక్తసంబంధీకులు ఎవరూ లేకపోవడంతో ఆస్పత్రి ప్రాంగణంలోనే జీవనం సాగించేది. వయసు రీత్యా ఆమెను ఇటీవల 3 నెలల క్రితం ప్రభుత్వం విధుల నుంచి తొలగించింది. అయినా ఆస్పత్రి ప్రాంగణంలోనే ఉన్న ఆమె అనారోగ్యంతో మరణించింది. ఆమెకు ఆస్పత్రి వైద్యులు లావణ్య, అనిత, సిబ్బంది, స్థానిక గ్రామస్తులు నివాళులర్పించారు.

ఉపాధి పనుల్లో నిబంధనలు పాటించాలి

పెళ్లకూరు: ఉపాధి పనుల నిర్వహణలో కచ్చితంగా నిబంధనలు పాటించాలని డ్వామా పీడీ శ్రీనివాసప్రసాద్ పేర్కొన్నారు. బుధవారం నెలబల్లి గ్రామంలో జరుగుతున్న ఉపాధి పనులను ఆయన తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ వేసవిలో వ్యవసాయ పనులు లేకపోవడం వల్ల ఉపాధి పనులను అన్ని ప్రాంతాల్లో కల్పించి వలసలు నివారించేందుకు ప్రతిఒక్కరూ తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఫీల్డ్ అసిస్టెంట్లకు సూచించారు. పనులు జరిగే ప్రాంతాల్లో కూలీలకు తాగునీరు, మెడికల్ కిట్లు అందుబాటులో ఉంచాలన్నారు. ఉపాధి పనుల్లో అవకతవకలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

చక్రస్నానం..పులకించిన భక్తజనం

- శాస్త్రోక్తంగా స్నపన తిరుమంజనం
- ధ్వజావరోహణంతో ముగిసిన బ్రహ్మోత్సవాలు



స్నపన తిరుమంజనం చేస్తున్న అర్చకులు



పుణ్య స్నానాలు ఆచరిస్తున్న భక్తులు





చక్రస్నానం నిర్వహిస్తున్న అర్చకులు

నారాయణవనం: టీటీడీ అనుబంధ శ్రీపద్మావతీ సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల్లో చివరి రోజు బుధవారం ఉదయం పద్మ సరస్సులో చక్రస్నానం శాస్త్రోక్తంగా జరిగింది. అశేష భక్తులు ఇదే సమయంలో పుణ్యస్నానాలు ఆచరించి పునీతులయ్యారు. వేకువ జామున 5 గంటలకు సుప్రభాత సేవతో శ్రీస్వామివారిని మేల్కొలిపి నిత్య పూజా కైంకర్యాలను నిర్వహించారు. ఎనిమిది గంటలకు పల్లకిపై స్వామివారు మాడ వీధుల్లో విహరించారు. అనంతరం శ్రీదేవి, భూదేవి సమేతంగా స్వామివారు చక్రత్తాళ్వార్‌తో కలిసి ఊరేగింపుగా పద్మ సరస్సు వద్దకు చేరుకున్నారు. వేదమంత్రాలు, మంగళవాయిద్యాల నడుమ చక్రత్తాళ్వార్, దేవదేవరులకు పాలు, పెరుగు, తేనె తదితరాల సుగంధ ద్రవ్యాలతో తిరుమంజనం నిర్వహించారు. 10.45 గంటలకు పద్మసరస్సులోని జలాలకు సంప్రోక్షణ పూజలు పూర్తి చేసి, చక్రత్తాళ్వార్‌కు అవభృథస్నానం చేయించారు. ఇదే సమయంలో భక్తులు సరస్సులో పుణ్యస్నానాలు ఆచరించారు. ఆలయానికి చేరుకున్న ఉత్సవర్లకు ఆస్థానం నిర్వహించి, ధూప దీప నైవేద్యాలను నిర్వహించారు.

శాస్త్రోక్తంగా ధ్వజావరోహణం

సాయంత్రం 7 గంటలకు విష్వక్సేనుడితో కలిసి స్వామి, అమ్మవార్లు మాడవీధి ఉత్సవంలో పాల్గొన్నారు. అనంతరం ఆలయంలో అంకురార్పణ సందర్భంగా ఆవాహనం చేసిన దిక్పాలకులకు ఉద్వాసన కార్యక్రమాన్ని పూర్తి చేసి, గరుడాళ్వార్ చిత్రపటమున్న వస్త్రాన్ని ధ్వజస్థంభం నుంచి అవరోహణం చేయించడంతో ఉత్సవాలు పరిసమాప్తమయ్యాయి. బ్రహ్మోత్సవాలను నిర్విఘ్నంగా నిర్వహించిన అర్చకులకు ఆలయ మర్యాదలు చేశారు. ఈ కార్యక్రమాలను డిప్యూటీ ఈవో నాగరత్న, ఏఈవో పార్థసారథి, సూపరింటెండెంట్ ధర్మయ్య, ఇంజినీరింగ్ ఏఈ గురుప్రసాద్, ఆర్జితం అధికారి భరత్, షరాబ్ శ్రీనివాస షనాయ్, రూరల్ సీఐ భాస్కర్ నాయక్, ఎస్ఐ లక్ష్మీనారాయణ పర్యవేక్షించారు.

చల్లంగ చూడు.. గంగమ్మ తల్లి



ఏర్పేడు: విశేషాలంకరణలో చేతాళ గంగమ్మ



ఏర్పేడు: గ్రామస్తులతో బియ్యపు పవిత్రారెడ్డి

ఏర్పేడు: మండలంలోని సరస్వతికండ్రిగలో బుధవారం చేతాళ గంగమ్మ జాతర వైభవంగా జరిగింది. మూడు రోజులుగా ఆలయంలో పలు రకాల పూజలు నిర్వహించారు. బుధవారం ఉదయాన్నే అమ్మవారికి వివిధ రకాల అభిషేకాలతో విశేషాలంకరణ చేసి పూజలు నిర్వహించారు. ఆలయం వద్ద అంబళ్లు పోశారు. పొంగళ్లు పెట్టి మొక్కులు తీర్చుకున్నారు. పలు గ్రామాల నుంచి వచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. గ్రామస్తులు ఆహ్వానం మేరకు వైఎస్సార్ సీపీ రేణిగుంట మండల ఇన్‌చార్జి బియ్యపు పవిత్రారెడ్డి జాతర పూజల్లో పాల్గొన్నారు. వైఎస్సార్ సీపీ మండల ఇన్‌చార్జ్ గున్నేరి కిషోర్‌రెడ్డి, వైస్ ఎంపీపీ జమళ్ల శ్రీనివాసులు, సర్పంచ్‌లు గంగాధరం, జయముని, మాజీ సర్పంచ్ వీరరాఘవరెడ్డి పాల్గొన్నారు.

నైనారుకండ్రిగలో..

నారాయణవనం: మండలంలోని నైనారుకండ్రిగ దళితవాడలో గంగ జాతర వైభవంగా జరిగింది. భక్తులు పెద్ద సంఖ్యలో విచ్చేసి అమ్మవారిని దర్శించి మొక్కులు చెల్లించారు. వైఎస్సార్ సీపీ సత్యవేడు ఎమ్మెల్యే అభ్యర్థి నూకతోటి రాజేష్ పూజల్లో పాల్గొన్నారు. ఆయల పాల్గొన్నారు. ప్రత్యేక పూజలను నిర్వహించి హారతులను అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మరోసారి వైఎస్సార్ సీపీ అత్యధిక సీట్లతో గెలుపొంది, జగనన్న సీఎం కావాలని, అందరూ సంతోషంగా ఉండాలని గంగమ్మను ప్రార్థించినట్లు తెలిపారు. ఆయనతో పాటు పార్టీ మండల కన్వీనర్ సొరకాయలు, సర్పంచ్‌లు సాయిరవి, నాగూరు, ధర్మలింగం బాలాజీ రెడ్డి, ముఖ్య నాయకులు కిరణ్, వెంకటరమణ, భాను ప్రకాష్‌రెడ్డి, మహేష్, మనోహర్, మణిరెడ్డి, మురళి, తిరువెంగడం, అయ్యప్ప, ఆర్ముగం, ఏలుమలై, అశోక్, రాజా, చీరాలయ్య పూజలో పాల్గొన్నారు.



నారాయణవనం: పూజల్లో నూకతోటి రాజేష్

నిబంధనలను తప్పక పాటించాలి



సీఐ దివాకర్‌రెడ్డి

వరదయ్యపాళెం: రానున్న సార్వత్రిక ఎన్నికల లెక్కింపు ప్రక్రియకు అన్ని రాజకీయ పార్టీల నాయకులు, ప్రజలు ఎన్నికల నిబంధనలకు అనుగుణంగా నడుచుకోవాలని సత్యవేడు సీఐ దివాకర్‌రెడ్డి సూచించారు. ఆయన బుధవారం మీడియాతో మాట్లాడారు. ఇప్పటికే అన్ని రాజకీయ పార్టీలకు సంబంధించిన నాయకులు కార్యకర్తలకు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సలహాలు, సూచనలు ఇచ్చామన్నారు. జూన్ 4వ తేదీన ఓట్ల కౌంటింగ్ సందర్భంగా అన్ని చర్యలు చేపట్టినట్లు చెప్పారు. అల్లర్లకు పాల్పడకుండా ప్రత్యేకంగా నిఘా ఉంచామని చెప్పారు. ర్యాలీ, విజయోత్సవాలకు ఏమాత్రం అనుమతులు లేవని ఆయన సూచించారు. బాణసంచా విక్రయాలు, కొనుగోళ్లు చేపట్టకూడదని, ఎక్కడ కూడా బాణసంచా పేలుళ్లు జరపకూడదని స్పష్టం చేశారు. దీనికి సంబంధించి గ్రామస్థాయిలో అవగాహన కల్పించినట్లు ఆయన పేర్కొన్నారు. పెట్రోల్ బంకుల వద్ద విడిగా బాటిళ్లలో పెట్రోల్, డీజిల్ పంపిణీ చేయకూడదని హెచ్చరించారు. ఇందుకు పెట్రోల్ దుకాణదారులకు గట్టి ఆదేశాలు జారీ చేశామన్నారు. ప్రతిఒక్కరూ నిబంధనలను పాటించి సహకరించాలని సీఐ కోరారు.

రుచిగా శుచిగా ‘గోరుముద్ద’



మాట్లాడుతున్న ఎంఈఓ ప్రభాకర్‌రాజు

నారాయణవనం: ప్రభుత్వ పాఠశాల్లో మధ్యాహ్నం అందించే గోరుముద్ద పౌష్టిక ఆహారాన్ని ప్రతి విద్యార్థి తినేలా రుచిగా, సుచిగా తయారు చేయాలని ఎంఈవోలు ప్రభాకర్‌రాజు, గోవిందస్వామి తెలిపారు. బుధవారం మండల విద్యా వనరుల కేంద్రంలో మండలంలోని ప్రభుత్వ పాఠశాలల మధ్యాహ్న భోజన నిర్వాహకులకు ఒక్క రోజు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. వారు మాట్లాడుతూ వర్కర్లు తమ విధులను బాధ్యతగా నిర్వర్తించాలన్నారు. మంచి పోషణతో కూడిన ఆహారాన్ని శుభ్రమైన వంటగదిలో తయారు చేయాలన్నారు. కిచెన్ గార్డెన్‌లో కూరగాయలను, ఆకుకూరలను పెంచుకోవాలని తెలిపారు. హాజరు సంఖ్య పెరిగేందుకు, పిల్లలో విద్యా ప్రమాణాల పెంపునకు మధ్యాహ్న భోజనం పథకం పరోక్షంగా ఉపకరిస్తుందని అన్నారు. మెనూ వంటకాలలో మరింత రుచిని పెంచడానికి తిరుపతి తాజ్ హోటల్ నైపుణ్య షెఫ్‌లు తయారు చేసిన విధానాల వీడియోను యూట్యూబ్‌లో తప్పక చూసి, మెలుకవలను పాటించాలని సూచించారు. నాలుగు గ్రూపులుగా విభజించి, వంటల పోటీలను నిర్వహించారు. డేటా ఎంట్రీ ఆపరేటర్ జయరాం, సీఎంఆర్టీ సత్యేంద్ర కుమార్, ఐఈఆర్పీలు విజయన్, భరత్, ఎంఆర్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యతో ఉజ్వల భవిష్యత్తు





సమావేశంలో మాట్లాడుతున్న లక్ష్మమ్మ, హాజరైన మహిళలు

ఏర్పేడు: విద్యతో ఆర్థికవృద్ధి, సామాజిక ఐక్యత సాధ్యపడుతుందని ఉన్నత విద్యా మండలి మాజీ వైస్ చైర్మన్, ప్రొఫెసర్ డాక్టర్ లక్ష్మమ్మ అన్నారు. బుధవారం మండలంలోని నాగంపల్లి ఎస్ఓఎస్ బాలల గ్రామంలో ఎస్ఓఎస్ఎఫ్ఎస్ ఆధ్వర్యంలో విద్య ప్రాముఖ్యతపై అవగాహన కార్యక్రమం జరిగింది. ఆమె మాట్లాడుతూ భావితరాల ఉజ్వల భవిష్యత్తును రూపొందించడంలో విద్య కీలక పాత్ర పోషిస్తుందన్నారు. ప్రస్తుతం ఎస్టీలు విద్యకు దూరంగా ఉంటున్నారని, తల్లిదండ్రులు పిల్లలను చదివించాల్సిన అవసరం ఎంతైనా ఉందని తెలిపారు. ఏర్పేడు, శ్రీకాళహస్తి మండలాలలోని ఎస్టీ కాలనీల నుంచి 120 మహిళలు హాజరయ్యారు. కార్యక్రమంలో ఎస్ఓఎస్ఎఫ్ఎస్ లొకేషన్ ఇన్‌చార్జ్ సత్యనారాయణ, సిబ్బంది మునిరత్నం, జీనద్, మహిళలు పాల్గొన్నారు.

కమనీయం..కల్యాణం



కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

వాకాడు: మండలంలోని అందలమాల గ్రామంలోని శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో రెండు రోజులుగా వార్షిక బ్రహ్మోత్సవాలు జరుగుతున్నాయి. అందులోభాగంగా మంగళవారం రాత్రి స్వామి వారి కల్యాణం వైభవంగా నిర్వహించారు. వేదపండితులు శాస్త్రోక్తంగా స్వామి అమ్మవార్ల అభిషేకం, కల్యాణం నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామి వారి కల్యాణం వీక్షించి, తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఆలయ ధర్మకర్త భూదేవమ్మ పాల్గొన్నారు.

1న హనుమజ్జయంతి వేడుకలు

రాపూరు: మండలంలోని పెంచలకోన క్షేత్రంలోని క్షేత్రపాలకుడైన ఆంజనేయస్వామికి జూన్ 1న హనుమజ్జయంతి వేడుకలను శాస్త్రోక్తంగా నిర్వహించనున్నట్లు దేవస్థాన అధికారులు తెలిపారు. ఉదయం 5 గంటలకు స్వామివారి మూలమూర్తికి అభిషేకం, పూలంగిసేవ, 10.30 గంటలకు ఆకుపూజ నిర్వహించనున్నారు. సాయంత్రం తిరుచ్చిపై ఆంజనేయస్వామి ఉత్సవ విగ్రహం కొలువుదీర్చి పెంచలకోన మాడవీధుల్లో క్షేత్రోత్సవం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

కోలాహలం.. వసంతోత్సవం





స్వామికి వసంతోత్సవ పూజలు, స్నపన తిరుమంజనం నిర్వహిస్తున్న అర్చకులు

నాయుడుపేటటౌన్: తుమ్మూరులోని శ్రీదేవి భూదేవి సమేత కరిమాణిక్యస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం స్వామివారి వసంతోత్సవం కనులపండువగా జరిగింది. ఇందులోభాగంగా ప్రత్యేకంగా అలంకరించిన సప్పరంపై స్వామివారు కొలువుదీరి గ్రామ పురవీధుల్లో ఊరేగిస్తూ వేదపండితులు వసంతాలు చల్లుతూ కోలహలంగా నిర్వహించారు. అనంతరం దేవదేవేరులకు ఆలయం వద్ద చక్రస్నానం నిర్వహించారు.ఉదయం నుంచి సుప్రభాతసేవ, ఆరాధన. సహస్రనామార్చన, బలిహరణం, మధ్యాహ్నం ఉత్సవర్లకు స్నపన తిరుమంజనం, రాత్రి ఉయ్యాల సేవ, ఏకాంతసేవ నిర్వహించారు.

నేడు పుష్పయాగ పూజలు..

బ్రహోత్సవాల్లో చివరి రోజు గురువారం సాయంత్రం ఆలయం వద్ద స్వామి, అమ్మవార్లకు పుష్పయాగ పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ ఇన్‌స్పెక్టర్ హరిరెడ్డి తెలిపారు. ఉదయం స్వామివార్ల అభిషేక వేడుకలతో ఉత్సవాలు ముగియనున్నట్లు తెలిపారు.

సత్యవేడులో జాతర సందడి



బుధవారం రాత్రి పురవీధుల్లో ఊరేగుతున్న గంగమ్మ

సత్యవేడు: సత్యవేడు గంగమ్మ జాతర బుధవారం రాత్రి వైభవంగా ప్రారంభమైంది. రజకుల ఇంటిలో మహిషాసురమర్ధినిగా గంగమ్మ రూపాన్ని బంకమన్నుతో తయారు చేశారు. అమ్మవారికి విశేషపూల అలంకరణతో పచ్చలహారం, కాసుల హారం మామిడి మాల, సూర్యచంద్రకళ కాళ్ల గజ్జలు ముక్కుపుడక, త్రిశూలం, వెండికిరీటం తొడిగారు. తదుపరి తప్పెట్లు, డప్పులు, బాణసంచా పేలుళ్ల సందడి, విద్యుత్ దీపాల నడుమ అమ్మవారిని రజకులు తలపై మోస్తూ పట్టణంలోని గాంధీరోడ్డు, నేతాజీ రోడ్డు, పల్లావువీధి, జయరాంబత్తుడు వీధుల్లో ఊరేగించారు. భక్తులు అమ్మవారికి గండుదీపం, వేపచీర మొక్కులు చెల్లించారు. అప్పటికే అర్ధరాత్రి అయ్యింది. ఊరేగింపు గురువారం తెల్లవారు జాము వరకు సాగి నడివీధి గంగమ్మ వద్ద పర్ణసాలలో అమ్మవారు కొలువుదీరనున్నట్లు జాతర నిర్వాహకులు తెలిపారు.

సారె సమర్పణ

జాతర సందర్భంగా సురుటుపల్లి శ్రీపల్లికొండేశ్వరస్వామి ఆలయ చైర్మన్ ఏవీఎం బాలాజీ రెడ్డి, ఈఓ కె.రామచంద్రా రెడ్డి, బాల నాగాలమ్మ ఆలయ ధర్మకర్త పి.రేవతమ్మ, ఆలయ భక్త బృందం విడివిడిగా సత్యవేడు గంగమ్మకు పట్టువస్త్రాలతో కూడిన సారెను సమర్పించారు. తొలుత సురుటుపల్లి ఆలయ కమిటీ సభ్యులు మునివేలు, ఆనంద్, అజయ్‌కుమార్, ఎంపీపీ వి.ప్రతిమ, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ కె.సుశీల్‌కుమార్ రెడ్డితో కలసి శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయం వద్ద నుంచి పట్టువస్త్రాలు, 14 తట్టల సారెను తీసుకుని ఊరేగింపుగా గంగమ్మ గుడికి వెళ్లి జాతర నిర్వాహకులకు అందజేశారు. అనంతరం శ్రీ బాలనాగాలమ్మ ఆలయ కమిటీ భక్త బృందం బంగారు గిన్నె బొట్టు, పట్టువస్త్రాలు, 51 రకాలు వస్తులున్న సారెను అమ్మవారికి సమర్పించారు.



సారె తీసుకు వస్తున్న సురుటుపల్లి ఆలయ చైర్మన్ బాలాజీ రెడ్డి



బండిపై సారె తీసుకు వస్తున్న బాలనాగాలమ్మ ఆలయ ధర్మకర్త రేవతమ్మ

వ్యవసాయశాఖ సూచనలతో అధిక దిగుబడులు

డక్కిలి: రైతులు అధికారుల సూచనల మేరకు పంటలను సాగుచేస్తే అధిక దిగుబడులు సాధించవచ్చునని కృషి విజ్ఞాన కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ బి.గోవిందరాజులు పేర్కొన్నారు. మండలంలోని కమ్మవారిపల్లిలో రైతు సదస్సు, ఉద్యాన ప్రదర్శన కార్యక్రమాలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రైతులు గ్రామాల్లో నాణ్యమైన దిగుబడులతో పంటలు సాగుచేసేందుకు కృషి విజ్ఞాన కేంద్రం రైతులకు అందుబాటులో ఉంటుందన్నారు. వ్యవసాయ భూముల్లో భూసార మట్టి నమూనా పరీక్షల ఆధారంగా పంటలు సాగుచేయాలన్నారు. అనంతరం రైతులతో ముఖాముఖి నిర్వహించారు. ఈసందర్భంగా రైతులకు భూసార పరీక్ష నమూనా పత్రాలు అందజేశారు. కేబీఎస్ ఉద్యానవన కళాశాల అసోసియేట్ డీన్ వీరన్నగౌడ్, కళాశాల సిబ్బంది సుస్మల, అఖిల్‌బాబు, కేవీకే శాస్త్రవేత్తలు తిరుపాల్, రాజీవన, విజయశ్రీ, నాగార్జునరెడ్డి, ఆనంద్ రెడ్డి పాల్గొన్నారు.